రోడ్ షో లో మాట్లాడుతున్న మంత్రి తన్నీరు హరీశ్‌రావు







# కాటేసే కాంగ్రెస్ కావాలా? కాపాడే కేసీఆర్ కావాలా?

- కర్ణాటకలో కాంగ్రెస్ ఊదరగొట్టిన ఐదు గ్యారంటీలు విఫలం
- కాంగ్రెస్‌కు ఓటేస్తే నట్టేట ముంచుతారు..
- ఎల్లారెడ్డి రోడ్‌షోలో మంత్రి హరీశ్‌రావు

ఎల్లారెడ్డి, నవంబర్ 24 : కరెంటు కావాలా? కష్టాలు, కన్నీళ్ల కాంగ్రెస్ కావాలా? అంటూ మంత్రి హరీశ్‌రావు ప్రజలను సూటిగా ప్రశ్నించారు. ఎల్లారెడ్డి పట్టణంలో శుక్రవారం నిర్వహించిన రోడ్ షోలో ఆయన ప్రసంగించారు. ఇచ్చిన మాటమీద నిలబడని కాంగ్రెస్ పార్టీని నమ్మి రిస్క్‌లో పడదామా? లేక ప్రజలకు మంచి పరిపాలన ఇస్తున్న తెలంగాణ గాంధీ కేసీఆర్‌ను గెలిపించి మూడోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామా? అని అడిగారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎల్లారెడ్డి పట్టణానికి శుక్రవారం హెలికాప్టర్‌లో వచ్చిన హరీశ్‌రావు, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు చేపట్టిన రోడ్ షోలో స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్, ఎంపీ బీబీ పాటిల్‌లతో కలిసి పాల్గొన్నారు. గాంధీ చౌక్ వద్ద ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఐదు గ్యారెంటీ పథకాల హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడం లేదని ఆయ న విరుచుకు పడ్డారు. కర్ణాటక రైతులు కరెంటు కష్టాలు అనుభవిస్తున్నారని, కరెంటు కావాలా.. మోసం చేసే కాంగ్రెస్ కావాలో ఆలోచించుకోవాలన్నారు. కర్ణాటకలో మూడు గంటల కరెంట్ మాత్రమే ఇస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్‌ను నమ్మి కర్ణాటక రైతులు ఓటేస్తే వారిని నట్టేట ముంచారని, తన మాటలు నమ్మకపోతే, కేవలం రెండు గంటల్లో చేరే కర్ణాటక బోర్డర్‌కు వెళ్లి అక్కడి పరిస్థితి చూడాలని ప్రజలకు సూచించారు. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ రైతులకు ఐదు గంటల కరెంట్ ఇస్తున్నామని చెబుతున్నారని, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంట్ చాలని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. 10హెచ్‌పీ మోటర్లు ఉంటే మూడు గంటల్లో పొలంలో నీరు పారించుకోవచ్చని రేవంత్‌రెడ్డి అన్నారని, ఎవరికైనా అటువంటి మోటర్లు ఉన్నాయా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. 24 గంటల పాటు ఉచిత కరెంటు వ్యవసాయానికి ఇచ్చే కేసీఆర్ పాలనను కాదని రిస్క్ తీసుకుందామా అని ప్రశ్నిస్తూ, కాంగ్రెస్‌ను నమ్మి మోసపోదామా అని పేర్కొన్నారు. తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీల హయాంలో వ్యవసాయం దండుగ అన్నారని, రెండు పార్టీలు వ్యవసాయాన్ని పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. ఎరువుల కోసం రైతులు చెప్పులను లైన్‌లో పెట్టేవారని.. ఆ పరిస్థితులు ఇప్పుడు ఉన్నాయా అని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో కరెంట్ కష్టాలు పోయాయని, చెరువులు బాగు చేసుకోవడంతోపాటు చెక్‌డ్యామ్‌లు నిర్మించామన్నారు. పెట్టుబడి సాయం, ఎరువులు, విత్తనాలు సకాలంలో అందిస్తూ రైతులకు అవసరమైన ప్రతి సదుపాయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ కల్పించారన్నారు. కర్ణాటకకు చెందిన కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున ఖర్గే తెలంగాణను బిచ్చం వేశామని పేర్కొన్నారని, తెలంగాణ ప్రజలకు అవమానిస్తే ఖబడ్దార్ అని హరీశ్‌రావు హెచ్చరించారు. మీ మధ్యలో ఉంటున్న మీ బిడ్డ సురేందర్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎల్లారెడ్డి పక్కనే ఉన్న కామారెడ్డిలో సీఎం కేసీఆర్ ఉంటారని, తోడుగా భుజమానిచ్చి ఎల్లారెడ్డి అభివృద్ధి నిధులు మంజూరు చేస్తారని ఆయన పేర్కొన్నారు.



బోనాలతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు



డాబా ఎక్కి ప్రసంగం వింటున్న ప్రజలు

## ఎన్నికలంటే ఐదురోజుల పండుగ కాదు..

గాంధారి, నవంబర్ 24: ఎన్నికలంటే ఐదు రోజులు పండుగ కాదని, ఐదేండ్ల భవిష్యత్తని, ఆలోచించి ఓటు వేయాలని మంత్రి హరీశ్‌రావు సూచించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా లింగంపేట్ మండల కేంద్రంలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేసీఆర్ అంటే నమ్మకమని, కేసీఆర్ అంటే విశ్వాసమని అన్నారు. కేసీఆర్ పాలనలో మంచి పనులు జరిగాయని, చెరువులను బాగు చేయడంతోపాటు చెక్‌డ్యాములు నిర్మించడంతో భూగర్భ జలాలు పెరిగి బోరుబావులు నిండుగా పోస్తున్నాయన్నారు. దీంతో రెండు పంటలు పక్కాగా పండుతున్నాయని అన్నారు. నాడు కరెంట్ ఉంటే వార్త, నేడు కరెంట్ పోతే వార్త అని అన్నారు. కరెంట్ కోసం దొంగ రాత్రుల్లో పొలాల వద్ద ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఉండేవన్నారు. ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఉద్యమకారుడైన జాజాల సురేందర్‌ను భారీ మెజార్టీతో గెలించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేసి జాజాల సురేందర్‌ను గెలిపించాలని అన్నారు.





## అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

గాంధారి, నవంబర్ 24 : నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని చూసి మరోసారి ఆశీర్వదించాలని బీఆర్‌ఎస్ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థి జాజాల సురేందర్ అన్నారు. స్థానికుడైన తనను మరోసారి ఆదరించాలని ప్రజలను కోరారు. కరోనాతో రెండు సంవత్సరాలు వృథాకాగా తనకు దొరికిన రెండు సంవత్సరాల కాలంలో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశానని అన్నారు. తాను ఎవరికీ అన్యాయం చేయలేదని, ఎవరినీ పోలీస్ స్టేషన్‌లో వేసి కొట్టించలేదని అన్నారు. కారుగుర్తుకు ఓటు వేసి మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.